సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం, 5, జూన్, 2024



భూమికి సారం.. రైతుకు ఆధారం

మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ మార్పు భవిష్యత్తు తరాలకు ప్రతికూలం కానుంది. -2లో



లింగాల ఎంఈఓ-2 మృతి

లింగాల మండలం ఎంఈఓ-2గా పనిచేస్తున్న డి.వి.ప్రసాద్(50) మంగళవారం మృతి చెందారు. ఆయన కుటుంబానికి మండల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. -2లో



ఆక్రమణలు అడ్డుకోనేదెవరు!

జి.కొత్తకోట సమీపంలోని పెయింటర్స్ కాలనీ వద్ద ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. -2లో

కూటమిదే పైచేయి!

- ఉమ్మడి కడప జిల్లాలో 7 స్థానాలు దక్కించుకున్న కూటమి
- 3 అసెంబ్లీ సెగ్మెంట్లకు వైఎస్సార్ సీపీ పరిమితం
- 2 ఎంపీ స్థానాలు దక్కించుకుని సత్తా చాటిన వైఎస్సార్‌సీపీ



సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా ఓటర్లు కూటమికి జై కొట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి సానుకూలంగా వీచిన పవనాలు జిల్లాలోనూ ప్రభావం చూపాయి. ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 10 స్థానాలకు గానూ ఏడు స్థానాలను తెలుగుదేశం కూటమి దక్కించుకోగా, వైఎస్సార్‌సీపీ 3అసెంబ్లీ స్థానాలకు పరిమితమైంది. కడప, రాజంపేట రెండు పార్లమెంటు స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకోగా, పార్లమెంటు స్థానాల పరిధిలో ఐదు అసెంబ్లీ స్థానాలను సొంతం చేసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో ఇరువైళ్ల తర్వాత తెలుగుదేశం హవా కన్పించింది.

- వైఎస్సార్ జిల్లాలో ఏడు శాసనసభ స్థానాలకు గాను ఐదు స్థానాలను టీడీపీ కూటమి సభ్యులు దక్కించుకున్నారు. తొలిసారిగా బీజేపీ జమ్మలమడుగులో ఖాతా తెరవడం విశేషం. పులివెందుల, బద్వేలు శాసనసభ స్థానాలకే పరిమితమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప లోక్‌సభ స్థానాన్ని మాత్రం తన ఖాతాలో వేసుకుంది.

కడప పార్లమెంట్ పరిధిలో..



కడప పార్లమెంటు స్థానంలో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు మొత్తం కలిపి చెల్లుబాటు అయిన ఓట్లు 12,97,362 ఉన్నాయి. ఇందులో వైఎస్ అవినాష్‌రెడ్డికి 5,97,101 ఓట్లు (46.02 శాతం) లభించగా, టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి 5,31,611 (40.98 శాతం) ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు 1,35,731 (10.46 శాతం) ఓట్లు వచ్చాయి. దీంతో అవినాష్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి భూపేష్‌రెడ్డిపై 65,490 ఓట్ల ఆధిక్యతతో గెలుపొంది తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. బద్వేలు, పులివెందుల నియోజకవర్గాలు మినహా మిగతా అన్నిచోట్ల భూపేష్ ఆధిక్యత సాధించారు.

అసెంబ్లీ స్థానాల పరిధిలో..

ఇక శాసనసభ స్థానాలకు సంబంధించి చెల్లుబాటు అయిన ఓట్లు 12,86,936 ఉన్నాయి. నియోజకవర్గాల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే....



- పులివెందుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61,687 ఓట్ల భారీ ఆధిక్యతతో గెలుపొంది తనకు ఎదురేలేదని నిరూపించుకున్నారు. ఆయనకు 1,16,315 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి బీటెక్ రవికి 54,628, కాంగ్రెస్ అభ్యర్థి ధృవకుమార్‌రెడ్డికి 10,083 ఓట్లు రాగా నోటాకు 1764 వచ్చాయి.



- బద్వేలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధకు 90,410 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్నకు 71,843 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతికి 7366 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ దాసరి సుధ 18,357 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా నోటాకు 3076 ఓట్లు నమోదు కావడం విశేషం.




- కడప అసెంబ్లీ నియోకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎస్‌బీ అంజద్‌బాషకు 72,128, టీడీపీ అభ్యర్థి మాధవి రెడ్డికి 90,988, కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌కు 24,500, నోటాకు 1444 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి మాధవి రెడ్డి 18,860 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డికి 92,499 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డికి 1,09,640 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డికి 4222 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి 17,191 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.





- కమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రవీంద్రనాథ్‌రెడ్డికి 69,850 ఓట్లు, టీడీపీ అభ్యర్థి పుత్తా కృష్ణచైతన్యరెడ్డికి 95,207 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి బాల చెన్నయ్యకు 2261 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పుత్తా చైతన్యరెడ్డి 25,357 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.



- ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డికి 1,06,712 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి 83,968 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి షేక్ పూల మహమ్మద్ నజీర్‌కు 6016 ఓట్లు వచ్చాయి. ఇక్కడ టీడీపీ అభ్యర్థి 22,744 ఓట్లతో గెలుపొందారు.



- మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్.రఘురామిరెడ్డికి 75,231 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ 96,181 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గుండ్లకుంట శ్రీరాములుకు 4,579 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ 20,950 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.

అసెంబ్లీ స్థానాలు

నియోజకవర్గం	వైఎస్సార్ సీపీ	టీడీపీ కూటమి	కాంగ్రెస్	మెజార్టీ	నోటా
బద్వేలు	90410	71843	7366	18357(వైసీపీ)	3076
కడప	72128	90988	24500	18860(టీడీపీ)	1444
జమ్మలమడుగు	92449	109640	4222	17191(టీడీపీ)	2392
మైదుకూరు	75231	96181	4579	20950(టీడీపీ)	1564
ప్రొద్దుటూరు	83968	106712	6016	22744(టీడీపీ)	1740
పులివెందుల	116315	54628	10083	61687(వైసీపీ)	1764
కమలాపురం	69850	95207	1092 (సీపీఐ)	25357(టీడీపీ)	2128

కడప లోక్‌సభ

నియోజకవర్గం	చెల్లిన మొత్తం ఓట్లు	వైఎస్ అవినాష్‌రెడ్డి	భూపేష్‌రెడ్డి	షర్మిల
బద్వేలు	172015	91,211	62,342	10,552
కడప	182400	61,418	65,627	51,563
పులివెందుల	185724	107426	47,473	25,861
కమలాపురం	170912	75,232	79,750	12,080
జమ్మలమడుగు	210431	96,996	1,02,318	6079
ప్రొద్దుటూరు	197692	83,233	90,964	19,964
మైదుకూరు	178188	81,585	83,137	9632
మొత్తం	12,97,362	5,97,101	5,31,611	1,35,731

అన్నదమ్ముళ్ల విజయభేరి

- హ్యాట్రిక్ సొంతం చేసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి
- కడప, రాజంపేట పార్లమెంటు సభ్యులకు చెదరని ప్రజాభిమానం
- ఉమ్మడి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం

సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికల ఫలితాల్లో ఇద్దరు అన్నదమ్ముళ్లు జయభేరీ మోగించారు. హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రజాభిమానం చెక్కు చెదరలేదని నిరూపించుకున్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వరుసగా మూడుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ దక్కించుకోగా.. కడప పార్లమెంటు సభ్యుడుగా వైఎస్ అవినాష్‌రెడ్డి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. 2014, 19, 24లల్లో ప్రజాభిమానంతో విజయం సాధించారు. ఇద్దరూ హ్యాట్రిక్ చరిత్రను ఒకేసారి సొంతం చేసుకున్నారు. ఎమ్మెల్యేగా 2014లో తొలిసారి ఎన్నికైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా మూడు సార్లు విజయం సాధించారు. ఈమారు 61,687 మెజార్టీతో దక్కించుకుని భారీ విజయాన్ని చేజిక్కించుకున్నారు.

పార్లమెంటు సభ్యులపై చెదరని అభిమానం

కడప, రాజంపేట పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇరువురుపై ప్రజాభిమానం చెక్కు చెదరలేదని మరోమారు రుజువైంది. ఎన్నికల ఫలితాల్లో ఇద్దరూ విజయం సాధించారు. వరుసగా మూడు సార్లు ఎంపీగా ఎన్నికైన మిథున్‌రెడ్డి సైతం హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇద్దరూ వైఎస్సార్‌సీపీ ఎంపీలు హాట్రిక్ సాధించడం విశేషం. కాగా ఉమ్మడి జిల్లాలో రాజంపేట, పులివెందుల, బద్వేల్ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. అమర్‌నాథరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సుధా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

ఆశయాన్ని నెరవేర్చుకున్న పుత్తా, పుట్టా, రాముడు...

ఎమ్మెల్యే కావాలనే ఆశయాన్ని పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నెరవేర్చుకున్నారు. 2004 నుంచి ఎమ్మెల్యే కావాలనే మండిపల్లి రామప్రసాద్‌రెడ్డి ఆశ ఇప్పటికి నెరవేరింది. రాయచోటి ఎమ్మెల్యేగా విజయం సాధించి జీవితాశయాన్ని తీర్చుకున్నారు. అలాగే కమలాపురం ఎమ్మెల్యేగిరి కోసం పుత్తా కుటుంబం అవిశ్రాంత పోరాటం చేసింది. పుత్తా నరసింహా రెడ్డి నాలుగు సార్లు పోటీ చేసి విఫలం కాగా, ఆయన కుమారుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఈమారు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే పుట్టా సుధాకర్‌యాదవ్ రెండుసార్లు మైదుకూరు నుంచి ఓటమి చవిచూడగా ఈమారు విజయాన్ని చేజిక్కించుకొని ఆశయాన్ని నెరవేర్చుకున్నారు.

టీడీపీ ఎమ్మెల్యేగా రెండోసారి...

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదరాజులరెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా రెండో పర్యాయం ఎన్నికయ్యారు. 1985లో ఓమారు ఆ పార్టీ నుంచి విజయం సాధించిన ఆయన తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. 2009లో ఓటమి చవిచూసిన ఆయన తిరిగి 2024లో టీడీపీ ఎమ్మెల్యేగా మరోమారు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకూ ప్రొద్దుటూరు ఎన్నికల చరిత్రలో 1983, 1985, 2009, 2024లల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించడం విశేషం.

కడపలో చరిత్ర తిరగరాసిన మాధవి రెడ్డి...

కడపలో మూడు దశాబ్దాలుగా ముస్లిం మైనార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తులే ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. 1994లో డాక్టర్ ఖలీల్ బాషా విజయం అనంతరం వరుసగా ఆరు పర్యాయాలు ముస్లిం మైనార్టీ నేతలు విజయం సాధించారు. ఖలీల్ బాషా, అహ్మదుల్లా, ఎస్‌బీ అంజాద్ బాషా వరుసగా రెండు సార్లు చొప్పున విజయం సాధించారు. ఈచరిత్రను టీడీపీ అభ్యర్థిగా రెడ్డెప్పగారి మాధవిరెడ్డి తిరగరాశారు. మూడు దశాబ్దాలుగా సాధించలేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. కందుల శివానందరెడ్డి తర్వాత ముస్లిమేతర ఎమ్మెల్యేగా కడపలో మాధవీరెడ్డి ఎంపిక కావడం విశేషం.

ఒకే కుటుంబంలో ముగ్గురి విజయం

రాజంపేట: సార్వత్రిక ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబం పట్టు నిలుపుకుంది. ఎన్నికల రణరంగంలో వైఎస్సార్‌సీపీకి వ్యతిరేక పవనాలు వీచినా ఆయా నియోజకవర్గాల్లో మాత్రం పెద్దిరెడ్డి కుటుంబం మరోమారు విజయకేతనం ఎగురవేసి పట్టు నిలుపుకుంది. ప్రధానంగా పుంగనూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సెగ్మెంట్ నుంచి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జెండా ఎగురవేయగా, రాజంపేట లోక్‌సభ స్థానం నుంచి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విజయబావుటా ఎగురవేశారు. ఇలా పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో కూడా పెద్దిరెడ్డి కుటుంబం గెలుపుతో తమ సత్తా చాటింది.

ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను దక్కించుకున్న రాజంపేట వాసులు

సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట లోక్‌సభస్థానం, అసెంబ్లీ స్థానాలను రాజంపేట వాసులు కైవసం చేసుకున్నారు. తమ ఓట్లను ఆకేపాటి, మిథున్‌రెడ్డిలకు వేసి గెలిపించారు. గతంలోనూ ఆకేపాటి, మిథున్‌రెడ్డిలు ఎమ్మెల్యేగా, ఎంపీగా కలిసి పనిచేశారు. అయితే గత ఎన్నికల్లో అమర్‌నాథరెడ్డికి టిక్కెట్ రాకపోవడంతో ఆయన పోటీ చేయలేకపోయారు. అయితే ఈసారి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్యంగా అమర్‌నాథరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, పార్టీ క్యాడర్, ముఖ్యమైన నేతలు అమర్‌నాథ్‌రెడ్డి, మిథున్‌రెడ్డిల విజయం కోసం శ్రమించారు.

ముచ్చటగా మూడోసారి ఎంపీగా మిథున్‌రెడ్డి

- అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం
- ఆద్యంతం ఆసక్తి రేపిన రాయచోటి ఎన్నిక
- అనుకోకుండా తెరమీదికొచ్చిన అరవ శ్రీధర్
- హోరాహోరీ పోరులో మదనపల్లె టీడీపీ కైవసం
- పీలేరులో ఆది నుంచి ఆధిక్యం ప్రదర్శించిన టీడీపీ

సాక్షి రాయచోటి: జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రాజంపేట పార్లమెంటుకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను మంగళవారం అధికారులు నిర్వహించారు. అందులో రెండు స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించగా, నాలుగు స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. రాజంపేట పార్లమెంటు స్థానాన్ని మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.

మిథున్‌రెడ్డికి భారీ మెజార్టీ



అన్నమయ్య జిల్లాలోని రాజంపేట పార్లమెంటు స్థానానికి మూడోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విజయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి, కూటమి అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిపై 76,071 ఓట్ల మెజార్టీ సాధించారు. జిల్లాలో నాలుగు స్థానాల్లో కొంతమేర టీడీపీకి అనుకూలమైన తీర్పు వచ్చినప్పటికీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విషయంలో ప్రజలు మద్దతుగా నిలిచి భారీ మెజార్టీని అందించారు. ఆది నుంచి మిథున్‌రెడ్డికి రౌండ్లలో మెజార్టీ అంతకంతకూ పెరుగుతూ రావడంతో భారీ మెజార్టీతో విజయం సాధించారు.

విజయదుందుభి మోగించిన ఆకేపాటి, ద్వారక





జిల్లాలోని ఆరు సెగ్మెంట్లలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ప్రధానంగా రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయాన్ని అందుకున్నారు. రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన సమీప ప్రత్యర్థి, టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంపై 7016 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మరోవైపు తంబళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విజయం నల్లేరుపై నడకలా కొనసాగింది. మధ్యలో ఒకటి, రెండు రౌండ్లలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి మెజార్టీ కనిపించినా ఆ తర్వాత వరుస రౌండ్లలో ద్వారకనాథరెడ్డి దూసుకెళ్లారు. దీంతో టీడీపీ అభ్యర్థిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సుమారు 10,103 ఓట్ల మెజార్టీతో పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

రాయచోటిలో ఆద్యంతం ఆసక్తికరం



జిల్లాలోని రాయచోటి అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఫలితాలు ఆసక్తిని రేపాయి. ఉదయం కొన్ని రౌండ్లలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మరికొన్ని రౌండ్లలో టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు మెజార్టీ సాధిస్తూ వచ్చారు. రౌండ్లు పెరిగే కొద్దీ అందరిలోనూ ఫలితాల మెజార్టీపై ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా 15, 17తోపాటు తర్వాత రౌండ్లలో మెజార్టీ ఒకరికి తగ్గడం, మరొకరికి పెరగడంతోపాటు సరాసరిన దరిదాపుల్లోనే ఇరువురి మెజార్టీ కొనసాగుతూ రావడంతో అందరిలో టెన్షన్ మొదలైంది. అయితే 20, 21 రౌండ్లలో టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సుమారు 1200 పైచిలుకు మెజార్టీ రావడం, ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా టీడీపీకి అధికంగా పడడంతో ఎట్టకేలకు ఫలితం టీడీపీ వైపు మొగ్గింది. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠంగా సాగిన రాయచోటి ఎన్నికలో ఎట్టకేలకు టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి 2495 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 15 ఏళ్ల తర్వాత రాయచోటి పీఠంపై తొలిసారి ఎమ్మెల్యేగా రాంప్రసాద్‌రెడ్డి విజయఢంకా మోగించారు.

అనుకోకుండా తెరమీదికి అరవ శ్రీధర్



రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు కాలం కలిసొచ్చిందని చెప్పవచ్చు. చివరి వరకు వైఎస్సార్‌సీపీలో ఉన్న ముక్కా రూపానందరెడ్డి టీడీపీలోకి వెళ్లడం, అంతలోనే ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అరవ శ్రీధర్‌ను గెలిపించుకున్నారు. అంతకుముందు జనసేన అభ్యర్థిగా ఇంకొకరిని ప్రకటించినా ఆయనతో గెలుపు సాధ్యం కాదని రూపానందరెడ్డి తన అనుచరుడికి అవకాశం ఇప్పించుకుని పోరాటం చేశారు. అనుకోకుండా అరవ శ్రీధర్‌కు అవకాశం లభించడం, సామాన్యుడిగా ఉన్న అరవ శ్రీధర్ విజయకేతనం ఎగురవేయడంతో ఒక్కసారిగా రైల్వేకోడూరు జనసేనలో సంచలనంగా మారింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులుపై 11,592 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

మదనపల్లె, పీలేరులో టీడీపీ అభ్యర్థుల విజయం





అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. మదనపల్లెలో మాత్రం టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా వైఎస్సార్ సీపీ అభ్యర్థి నిసార్ అహ్మద్‌ల మధ్య రౌండ్లు పోటాపోటీగా కొనసాగడంతో ఒక దశలో ఆసక్తి నెలకొంది. ఒకసారి వైఎస్సార్‌సీపీకి, మరొకసారి టీడీపీకి ఆధిక్యత రావడంతో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొన్నా తర్వాత చివరి రౌండ్లలో టీడీపీ అభ్యర్థి షాజహాన్ బాషా జయకేతనం ఎగురవేశారు. సుమారు 5509 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. అలాగే పీలేరులో టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలిచారు. ఆయన వైఎస్సార్ సీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై 23,438 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. పీలేరులో టీడీపీ అభ్యర్థి ఆది నుంచి మెజార్టీ కనబరుస్తూ వచ్చారు.

భారీ బందోబస్తు మధ్య కౌంటింగ్



కౌంటింగ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

చివరి వరకు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల్లో చివరి ఘట్టమైన కౌంటింగ్ కార్యక్రమం అన్నమయ్య జిల్లాలో భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా కొనసాగింది. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉద్యోగులు శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్నారు. కడప, రాయచోటి జాతీయ రహదారిలో భాగమైన రింగ్‌రోడ్డు నుంచి వేంపల్లి క్రాస్ రోడ్డు వరకు పోలీసులు మార్గాన్ని మూసివేసి ట్రాఫిక్‌ను మరోమార్గం ద్వారా మళ్లించారు. జిల్లాలోని రాజంపేట పార్లమెంట్‌తో పాటు రాయచోటి, రాజంపేట, కోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు నియోజకవర్గాలకు చెందిన అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల ఓట్లను రాయచోటి ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కించారు. ఈ కౌంటింగ్‌లో వెయ్యి మంది సిబ్బంది 200 మంది పోలీసులు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, సాంకేతిక నిపుణులు, పలువురు ఉన్నతాధికారులు దగ్గరుండి కార్యక్రమంలో చిన్న పొరపాటు లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

బారికేడ్లు ఏర్పాటు

కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ఉండేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. కళాశాల చుట్టూ, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

టిఫిన్ కొరతపై ఉద్యోగుల నిరసన

కౌంటింగ్ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి టిఫిన్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో సిబ్బంది నిరసన తెలిపారు. తమకు టిఫిన్ పెట్టకపోవడంపై మీడియా ముందుకు వచ్చి మండిపడ్డారు.

కౌంటింగ్ ప్రశాంతం



'మనూ'లో ఓట్ల లెక్కింపులో నిమగ్నమైన సిబ్బంది



బోసిపోయిన వైవీ స్ట్రీట్



కడప శిల్పారామం వద్ద పోలీసుల పహారా

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళశారం వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో ప్రశాంతంగా జరిగింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు చేపట్టింది. జనాలు గుమికూడకుండా పోలీసు యంత్రాంగం 144 సెక్షన్ అమలు చేశారు. ఫలితంగా ఉదయం నుంచే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.



డిక్లరేషన్ ఫారాన్ని అందుకుంటున్న కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి

క్లుప్తంగా

ప్రజా తీర్పును గౌరవిస్తాం
– మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని రాయచోటి వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా రాయచోటి నియోజకవర్గంలో తనకు ఓట్లు వేసిన 90వేల మందికిపైగా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడంతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు రాయచోటిలో జరుగుతుండడం సంతోషకరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు కూడా అభివృద్ధిని కొనసాగించాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. వేలకోట్ల రూపాయలు డీబీటీ ద్వారా అర్హత కల్గిన పేదలకు అందించిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. ప్రతిపక్షపాత్రను పోషిస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధికోసం పోరాటం కొనసాగిస్తామని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

మంచి పనులు చేశాం.. ఫలితం ఊహించలేదు


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్షలాది మందికి సంక్షేమం, అభివృద్ధి అందించే మంచి పనులు చేశారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఇలాంటి ఫలితం వస్తుందని ఊహించలేదు అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అవ్వా,తాతలు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ఇచ్చామని, రైతులకు భరోసా ఇస్తూ సంక్షేమం అందించామని, అమ్మ ఒడి, విద్యాదీవెన అందిస్తూ ముందడుగు వేసినా ఈ ఫలితాలు వస్తాయని ఊహించలేదన్నారు. నియోజకవర్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి, చిట్వేలి కోడూరు డబుల్ రోడ్డు, రెడ్డివారి పల్లె వంతెన, కోడూరులో 100 పడకల ఆసుపత్రి వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, వాటిని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విధిగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్తలు తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. జరిగిన కౌంటింగ్ ప్రక్రియపై వెంటనే విచారణ జరపాలని డిమాండ్‌చేశారు.

లింగాల మండల ఎంఈఓ-2 మృతి


డివి.ప్రసాద్(ఫైల్)

లింగాల : లింగాల మండలం ఎంఈఓ–2గా పని చేస్తున్న డివి.ప్రసాద్(50) మంగళవారం మృతి చెందారు. రెండు మాసాల క్రితం పులివెందులలో ద్విచక్ర వాహనంలో వెళ్తూ డివైడర్‌ను ఢీకొని ఆయన కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని రిటైర్డ్ ఎంఈఓ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన కుటుంబానికి మండల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

లెక్కింపు ప్రశాంతం.. వీధులు నిర్మానుష్యం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటి నుంచీ తమ అధికారులతో కలిసి బందోబస్తు విధులను పక్కాగా నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎప్పటికప్పుడు కేసులను నమోదు చేయడమేగాక, బైండోవర్, హౌస్ అరెస్ట్, జిల్లా బహిష్కరణలు అమలు చేశారు. కడప, మైదుకూరు, రాయచోటి, జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, ఏజెంట్లు, వారి వాహనాలలో వెళ్లి పార్కింగ్ చేసుకునేందుకు వీలు కల్పించారు. సాయంత్రం అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వివిధ కూడళ్లలో ఉదయం నుంచి దుకాణాలు, హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేసి ముందస్తుగా మూసివేశారు. సర్కిళ్లలో బారికేడ్లను పెట్టి వాహనాల రాకపోకలు బంద్ చేశారు. ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. – కడప అర్బన్


కడప అంబేడ్కర్ సర్కిల్ వద్ద జన సందోహం లేని దృశ్యం


కడప కౌంటింగ్ కేంద్రంలో కొనసాగిన ఓట్ల లెక్కింపు


కడప ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు విధులు


నిర్మానుష్యంగా కడప సెవెన్ రోడ్ సర్కిల్


మైదుకూరు పట్టణంలో వెలవెలబోతున్న వీధులు



రాయచోటిలో ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు


మదనపల్లిలోని బెంగళూరు బస్టాండులో గస్తీ నిర్వహిస్తున్న సిబ్బంది


పులివెందుల మెయిన్ బజార్‌లో పోలీసుల బందోబస్తు

ఆక్రమణలు అడ్డుకొనేదెవరు?

లక్షల రూపాయల స్థలాలు కనిపిస్తే చాలు.. ఆక్రమించి నిర్మాణాలు కొనసాగించేస్తున్నారు. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములను వదలడం లేదు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.


పెయింటర్స్ కాలనీ వద్ద అక్రమ నిర్మాణాలు

- లే అవుట్ లేకుండానే కొనసాగుతున్న నిర్మాణాలు
- రూ.లక్షల్లో విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు


మోడల్ స్కూల్ హాస్టల్ ఎదుట నిర్మాణాలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని పెయింటర్స్ కాలనీ చుట్టూ లక్షల రూపాయల విలువ చేసే భూములున్నాయి. పదేళ్ల కిందట ఇక్కడ మోడల్ స్కూల్ ఎదుట భూమిలో పెయింటింగ్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాలనీ చుట్టూ గుట్ట, బండరాళ్లు ఉండడంతో మోడల్ స్కూల్‌కు సంబంధించిన వసతి గదిని నిర్మించారు. అయితే కొంత కాలంగా కొందరు అక్రమార్కులు ఇళ్ల స్థలాలకు కేటాయించని భూమిని ఆక్రమించేశారు. బండరాళ్ల, గుట్టలను తొలిచి చదును చేసుకుంటున్నారు. లక్షల రూపాయలతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

అక్రమ నిర్మాణాలు

సాధారణంగా రెవెన్యూ అధికారులు ఇంటి నిర్మాణానికి ఎంత స్థలం కేటాయిస్తే అంత విస్తీర్ణంలో పనులు చేసుకోవాలి. కానీ ఆక్రమిత ప్రాంతంలో ఎలా పడితే అలా స్థలం మాది అంటూ కొందరు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. కేటాయించిన విస్తీర్ణం కనిపించడం లేదు. స్థలం కేటాయిస్తే రెవెన్యూ అధికారులు లే అవుట్ వేసి స్థలాలను అప్పగించాల్సి ఉండగా అవేవీ జరగడంలేదు. అయితే ఈ ప్రాంతంలో స్థలాలు కేటాయించిన ఆనవాళ్లు కనిపించడం లేదు. ఎవరికి వారు స్థలాలు ఆక్రమించేసుకుని కొందరు లక్షల రూపాయలకు విక్రయించుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

పట్టించుకోని అధికారులు

ప్రధానంగా మోడల్ స్కూల్ హాస్టల్ చుట్టూ స్థలాన్ని ఆక్రమించేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతకాలంగా ఈ వ్యవసాయం సాగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బీరంగి గ్రామ వీఆర్‌ఓ వరదరాజులు వివరణ కోరగా ఆక్రమించి నిర్మిస్తున్న స్థలాలకు పట్టాలు మంజూరైనట్టు రికార్డులు కనిపించలేదన్నారు. ఇచ్చి ఉంటే రికార్డులుండేవన్నారు.

భూమికి సారం..
రైతుకు ఆధారం

పులివెందుల రూరల్ : మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ మార్పు భవిష్యత్తు తరాలకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు రైతులను హెచ్చరిస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనా విధానంలో మార్పు వస్తోంది. భూసారాన్ని పెంచేందుకు సంప్రదాయ పద్ధతులపై ఆసక్తి కనబరుస్తున్నారు. పంటలు పూర్తిచేసి కోత తీసిన వెంటనే పొలాల్లోకి గొర్రెలు, మేకల మందలను కట్టివేయడం, కుళ్లిన పశువుల పెంటను పొలాల్లో వేయడం, పచ్చిరొట్ట వంటి సాంప్రదాయ పద్ధతులను పాటించడం చేస్తున్నారు. దీంతోపాటు సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో భూములకు గొర్రెలు, మేకలు ఆవుల విసర్జితాలను అందించడంపై రైతులు మక్కువ చూపుతున్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడిన భూముల్లో వచ్చిన చౌడు పరిస్థితులు..గొర్రెల మందల మలమూత్రాల విసర్జనతో విరిగిపోతుందన్నారు. మందలు కట్టిన తర్వాత భూమిని దున్నుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వీటివల్ల బూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధిచెంది తెగుళ్ల తగ్గుతాయని రైతులు అంటున్నారు.


పొలాల్లోకి వదిలిన మేకల మంద

వేసవి దుక్కులు లాభదాయకం

భూసారం వృద్ధి, తెగుళ్ల నివారణ

సంబేపల్లి : భూమి సారవంతంగా ఉంటే దిగుబడులు బాగుంటాయి. వరుసగా ఒకే పంట పండిస్తే భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో ఏటా వేరుశనగ పంట సాగుచేస్తారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనకాయలు అందుబాటులో ఉంచింది. కే-6 రకం విత్తనం 35323 క్వింటాళ్లు, నారాయణి రకం 18046, టిసిజిఎస్ రకం 900, కదిరి లేపాక్షి రకం 1114 క్వింటాళ్లను ఆర్బీకేల్లో ఉంచారు. వేరుశనగ సాగు చేసే రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో వేసవి దుక్కులు చేపడితే పంట దిగుబడులు బాగుంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు కాస్త తడిచి, దుక్కులు చేపట్టేందుకు అనువుగా ఉన్నాయని చెబుతున్నారు.


సంబేపల్లె మండలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

లోతు దుక్కులు అవసరం



ఖరీఫ్ సాగుకు ముందు లోతుగా దుక్కులు చేసి భూమిని చదునుపరచాలి. ఈ విధంగా సాగు చేయడం ఎంతో మేలు. మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో వరి రైతులకోసం విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వారంతా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలి. రైతులు పంట సాగు చేసే ముందు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.
– చంద్రానాయక్, అన్నమయ్య జిల్లా వ్యవసాయఅధికారి

పచ్చిరొట్ట ఎరువులు ఎంతో మేలు



పొలాల్లో విరామం లేకుండా ఒకే పంట వేస్తే భూములు నిస్సారంగా తయారవుతాయి. వరి పొలాల్లో వేసవి దుక్కులు చేపడితే గడ్డి నశించి, వరిమళ్ల కుళ్లి ఎరువుగా మారుతుంది. వివిధ రకాల పురుగులు పైకి రావడంతో పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. కొన్ని పురుగులు వేసవి తీవ్రతకు చనిపోవడంతో పురుగుల ఉధృతి తగ్గి పంటకు నష్టం కలగకుండా ఉంటుంది. రబీ తర్వాత అపరాలు సాగుచేసే భూములలో కాకుండా ఖాళీగా ఉంచిన పొలాల్లో దుక్కులు చేసుకుంటే తెగుళ్ల బెడద ఉండదు.
– వెంకటరమణ, రైతు, ఎస్.సోమవరం

మండే ఎండల్లో పశువులు జాగ్రత్త


డాక్టర్ జి.సుమన్ కుమార్, ప్రాంతీయ పశు వైద్యశాల

మైదుకూరు : భానుడి ప్రతాపానికి వేగంగా వీస్తున్న వడగాల్పుల నుంచి పాడి పశువులను సంరక్షించుకునే ఏర్పాట్లు చేసుకోవాలని మైదుకూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి.సుమన్ కుమార్ తెలిపారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతకు తక్కువ వయస్సు, ముదురు రంగు, శ్వాసకోశ, కాలేయం, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న, చూడి, అధిక పాల దిగుబడినిచ్చే, అధిక శరీర బరువు కలిగిన, చెమట పట్టే పశువులు, జంతువులను సంరక్షించుకోవాలన్నారు. ఎండ తక్కువగా ఉండే సమయంలో మేతకు తీసుకెళ్లి, 11 గంటల లోపల ఇంటికి తీసుకురావాల్సి ఉందని, పచ్చి మేత, ఖనిజ లవణాలు కలిగిన మిశ్రమాల దాణా అందించాలని, పశువులకు రాగి జావ, రాగి అంబలి, కొబ్బరి నీరు తాగించాలని సూచించారు. అన్ని వేళలా నీటి తొట్టెలో నీరుండేలా చూడాలని, వాటిని కట్టివేసే కొట్టం పైకప్పుపై తాటి మట్టలు, కొబ్బరి ఆకులు, వరిగడ్డి వేయాలన్నారు. గోనె సంచులను వేలాడదీసి చల్లని నీటితో తడపాలన్నారు. వడగాల్పుల సమయంలో టీకాలు వేయరాదని, చల్లని గాలి కోసం పశువుల ఫారాలలో ఆటోమేటెడ్ మిస్టింగ్ యంత్రాలు, కూలర్లు అమర్చాలన్నారు.

లక్షణాలు – ప్రాథమిక చికిత్స

- **వేడి బొబ్బలు :** చర్మం ఎర్రగా కమిలిపోయి నీటి బొబ్బలు ఏర్పడితే చల్లని నీరు, తడి గుడ్డతో తుడవాలి. పశు వైద్యుల సలహాతో వాటిపై మందు రాసి కట్టు కట్టాలి.
- తిమ్మిర్లు పట్టినా, కాలి కండరాలు, పొట్ట కండరాలు పట్టేసినట్లు తెలిసినా చల్లని నీడ ప్రదేశాల్లో కట్టేయాలి.
- పశువులకు ఎక్కువగా చెమట పట్టడం, నీరసంగా ఉండడ, చర్మపు రంగు కాంతి హీనంగా మారడం, ముక్కుపుటాలపై తేమ లేకుండా శ్వాసక్రియ వేగంగా జరగడంవంటి లక్షణాలుంటే చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. పశువులను ఒక చోట మందగా ఉంచకూడదు.
- శరీర ఉష్ణోగ్రత పెరిగి చర్మం వేడిగా పొడిబారితే తడిపిన జనపనార గోనె పట్టలు పశువుల నడుముపై వేయాలి. స్పాంజితో నీటిలో అద్ది తుడవాలి. వైద్యం అందించాలి.